క్లుప్తంగా

సుబ్రహ్మణ్యంకు సత్కారం



సుబ్రహ్మణ్యంను సత్కరిస్తున్న రోటరాక్ట్, రోటరీ క్లబ్‌ల మాజీ సభ్యులు

బోట్‌క్లబ్: రోటరాక్ట్, రోటరీ క్లబ్‌ల మాజీ సభ్యుడు, ఇటీవల అదనపు జిల్లా జడ్జిగా ఎంపికైన గ్రంధి సుబ్రహ్మణ్యంను రోటరాక్ట్, రోటరీ క్లబ్ పూర్వపు సభ్యుల ఆధ్వర్యంలో స్థానిక రోటరీ హాల్‌లో సోమవారం సత్కారం జరిగింది. క్లబ్ మాజీ గవర్నర్ ఎల్.సత్యనారాయణన్ మాట్లాడుతూ సుబ్రహ్మణ్యం జిల్లా జడ్జిగా ఎంపికవ్వడం క్లబ్‌కు గర్వకారణమన్నారు. కాకినాడ బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు ఏలూరు సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ తన వద్ద జూనియర్ న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్నప్పటి నుంచి క్రమశిక్షణతో చదివి అదనపు జిల్లా జడ్జిగా ఎంపికయ్యారన్నారు. ప్రోగ్రామ్ కన్వీనర్ యడ్లపల్లి వేణునాధరావు, వాకచర్ల సూర్యం, సన్నీ ఫ్రాన్సిస్, పైడా శ్రీరామ్, చలం పాల్గొన్నారు.

దంతాలను సంరక్షించుకోవాలి

బోట్‌క్లబ్: స్థానిక ఎల్‌బీనగర్‌లో సేవాభారతి నిర్వహిస్తున్న సచికేత పేద విద్యార్థుల ఉచిత ఆవాసంలో ఇండియన్ డెంటల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం దంత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుబ్బహ్మణ్యేశ్వరరావు మాట్లాడుతూ చిన్న వయసులో పాల దంతాలు, ఆరో ఏడాది నుంచి శాశ్వత దంతాలు రావడం మొదలవుతుందన్నారు. ఈ దంతాలను ప్రతి ఒక్కరూ సంరక్షించుకోవాలన్నారు. అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు డాక్టర్ అడ్డాల సత్యనారాయణ, డీఎస్ఆర్ శర్మ, రాజా రామచంద్ర, సతీష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పశు వైద్యుడికి జాతీయ అవార్డు



ఉత్తమ అవార్డు అందుకుంటున్న డాక్టర్ తలాటం సురేష్

కాకినాడ రూరల్: తిమ్మాపురంలో పశు వైద్యుడు తలాటం సురేష్ ఉత్తమ సేవా పురస్కారం పొందారు. ఈ నెల 22న చత్తీస్‌ఘడ్ రాష్ట్రం దుర్గ్ నగరంలో 19వ ఇండియన్ సొసైటీ ఫర్ అడ్వాన్స్‌మెంట్ ఆఫ్ కనైన్ ప్రాక్టీస్ మహాసభ జరిగింది. ఇందులో సురేష్ ఉత్తమ పశువైద్య శస్త్ర చికిత్సకుడిగా కామధేను వెటర్నరీ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ దక్షింకర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. సురేష్ మాట్లాడుతూ ఇది తన రెండో అవార్డు అన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని కలెక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో కాకినాడ అర్బన్ పరిధిలో గృహ నిర్మాణాల పురోగతిపై నగరపాలక సంస్థ కమిషనర్ ఆర్.మహేష్‌కుమార్, హౌసింగ్, డీఆర్‌డీఏ, మెప్మా, విద్యుత్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖలతో కలసి ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు కింద కాకినాడలో మంజూరైన ప్రతి గృహాన్ని, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలన్నారు. ఎస్‌హెచ్‌జీ రుణాల మంజూరుపై అధికారులు దృష్టి పెట్టాలన్నారు. జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనపై ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కొమరిగిరి, నేమాం-4, పండూరు, ఏపీ త్రయం జగనన్న కాలనీలలో గృహ నిర్మాణాల పురోగతి, సౌకర్యాల కల్పనపై సమీక్షించారు. హౌసింగ్ పీడీ బి.సుధాకర పట్నాయక్, ఏడీసీ సీహెచ్ నాగనరసింహారావు, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీరమణి, మెప్మా పీడీ బి.ప్రియంవద, ఏపీఈపీడీసీఎల్ ఈఈ ప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఎం.శ్రీనివాసు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరా బంద్

కరప: అరట్లకట్టలోని పంపు షెడ్‌లో ఓ దుండగుడు విద్యుత్ తీగలు కట్ చేయడంతో రెండు గ్రామాలకు సోమవారం తాగునీటి సరఫరా నిలిచిపోయింది. అరట్లకట్టలో రక్షిత మంచినీటి పథకం నుంచి అరట్లకట్ట, గొడ్డటిపాలెంలకు పైపులైన్ ద్వారా తాగునీరు అందుతోంది. ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తి పంపు షెడ్లు, బయట పైపులైన్‌కు కలిపే వైర్లను కట్ చేశాడు. దీంతో ప్రజలకు నీరు అందించలేక పోయామని ఆయా గ్రామాల సర్పంచులు గోపి సత్యవేణి, గణేష్, వాసంశెట్టి శ్రీనుబాబు తెలిపారు. మంగళవారం నుంచి యథావిధిగా నీరు అందిస్తామన్నారు. దీనిపై సోమవారం కరప పోలీస్ స్టేషన్‌లో గ్రామ కార్యదర్శి రాంజీ హీరాలాల్, సర్పంచులు ఫిర్యాదు చేశారు.

నిషేధం... నిర్లక్ష్యం

- పెరిగిన ప్లాస్టిక్ వినియోగం
- కోరలు చాస్తున్న కాలుష్య భూతం
- అధికారుల తనిఖీలు నామమాత్రం



రాజేశ్వరీనగర్‌లో తాగి పడేసిన ప్లాస్టిక్ గ్లాసులు



బాలాజీచెరువు సెంటర్‌లో తోపుడు బండి వద్ద ప్లాస్టిక్ కవర్లు

బోట్‌క్లబ్: పాలిథిన్ భూతం కోరలు చాచి చూస్తోంది.. అంతకంతకూ తన ప్రాబల్యాన్ని చాటుతోంది.. పుడమి తల్లిని కాలుష్యం బారిన పడేస్తోంది.. పర్యావరణ వినాసిని అని తెలిసినా ప్రజల్లో చైతన్యం కరవవుతోంది.. అదే జీవకోటిని కాలసర్పంలా హరించేలా బాటలు వేయిస్తోంది.. కాకినాడ నగరం స్మార్ట్ సిటీగా దినదిన అభివృద్ధి చెందుతోంది. తనకంటూ ప్రత్యేక గుర్తింపును తెచ్చుకుంటోంది. అయితే రోజు రోజుకూ పాలిథిన్ సంచుల వినియోగం విచ్చలవిడిగా పెరిగిపోతోంది. ఎక్కడ చూసినా ఈ వ్యర్థాలే దర్శనమిస్తున్నాయి. నగరంలో 50 డివిజన్లు ఉండగా సుమారు ఆరు లక్షలకు పైగా జనాభా నివసిస్తున్నారు. ఆయా డివిజన్ల నుంచి నిత్యం పారిశుధ్య సిబ్బంది 200 టన్నులకు పైగా చెత్త సేకరిస్తున్నారు. ఇందులో మూడు నుంచి నాలుగు టన్నుల వరకూ నిషేధిత ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు ఉంటున్నాయి.

పట్టించుకునే వారేరీ..

ఏ దుకాణానికి వెళ్లినా ప్లాస్టిక్ సంచి లేకుండా కార్యకలాపాలు జరగడం లేదు. కూరగాయలు, సరకులు, పండ్లు, ఇతర నిత్యావసర సరకులు ఈ బ్యాగుల్లోనే తీసుకువెళ్లడం ప్రజలకు అలవాటై పోయింది. ప్రభుత్వ నిబంధనలను పకడ్బందీగా అమలు చేయాల్సిన అధికారులు ఉదాసీనంగా వ్యవహరించడంతో ఎవరూ పట్టించుకోవడం లేదు. నగరంలో ఎక్కడా వీటి వినియోగం ఆగిన దాఖలాలు లేవు. ఆయా ప్రాంతాల్లో పాలిథిన్ బ్యాగ్‌లు, గ్లాసులు, ప్లేట్లు విక్రయించే దుకాణాలు పెద్దఎత్తునే ఉన్నాయి. వీటిని అధికారులు చూసీచూడనట్లు వదిలేయడంతో యథేచ్ఛగా వ్యాపారాలు సాగిస్తున్నారు. గతంలో ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు విక్రయిస్తే అపరాధ రుసుం వసూలు చేస్తామని హడావుడి చేసి వదిలేశారు. అప్పట్లో వ్యాపారులు వాటిని విక్రయించేందుకు భయపడేవారు. కొన్ని రోజులుగా తనిఖీలు లేకపోవడంతో ప్లాస్టిక్ కవర్లు మళ్లీ విచ్చలవిడిగా దర్శనమిస్తున్నాయి. క్యారీ బ్యాగులను వినియోగించి వాటిని విచక్షణా రహితంగా రోడ్లపై పడేస్తుండడంతో అవి మురుగు కాలువల్లో నీటి పారుదలకు ఆటంకంగా మారుతోంది. ప్రజలు పాలిథిన్ సంచిలలో ఆహార పదార్థాలు తీసుకుని తినడం, తరువాత వాటిని రోడ్లపై పడవేస్తుండడంతో మూగజీవాలు వాటిని తిని ప్రాణాలు కోల్పోతున్నాయి. మూడు నెలల కిందట అధికారుల దాడులతో నగరంలో ఏ దుకాణానికి వెళ్లినా పాలిథిన్ కవర్లు ఇచ్చేవారు కాదు. వినియోగదారులే సంచులు తెచ్చుకోవాలని పలు దుకాణాల వద్ద బోర్డులు ఏర్పాటు చేశారు. దీంతో పాలిథిన్ వినియోగం కాస్త తగ్గిందని అందరూ భావించారు. అధికారులు మళ్లీ వదిలేయడంతో వ్యాపారులు ఇష్టానుసారంగా విక్రయాలు జరుపుతున్నారు. బ్రాందీ షాపులు సమీపంలోని చిన్న దుకాణాల్లో విచ్చలవిడిగా నిషేధిత ప్లాస్టిక్ గ్లాసులు విక్రయిస్తున్నారు. దీంతో కొందరు మద్యం తాగి వాటిని కాలువల్లోనే పడేస్తున్నారు.

ప్రత్యేక డ్రైవ్ చేపడతాం..



నగరంలో కొందరు వ్యాపారులు ప్లాస్టిక్ బ్యాగులు, గ్లాసులు విక్రయిస్తున్నారు. ఇటీవల కాలంలో దాడులు నిర్వహించి పది కేసుల వరకూ నమోదు చేశాం. ఆయా ప్రాంతాల్లో పాలిథిన్ సంచులు విక్రయించే దుకాణాలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తాం. అపరాధ రుసుం వసూలు చేస్తాం.

–డాక్టర్ పృథ్వీచరణ్, హెచ్ఎంవో, నగరపాలక సంస్థ

జీవో అమలు చేయాలి

కాకినాడ సిటీ: తోలు బొమ్మలాట కులస్తులను వెనుకబడిన తరగతుల జాబితాలో చేరుస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేసింది. ఈ జీవోను వెంటనే అమలు చేసేలా అధికారులకు ఆదేశాలివ్వాలని కలెక్టర్ కృతికా శుక్లాను ఆ సంఘ నాయకుడు అనపర్తి ఏడుకొండలు కోరారు. ప్రభుత్వ తీసుకున్న నిర్ణయంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు.

రోగులకు దుప్పట్ల పంపిణీ

బాలాజీచెరువు: పేర్రాజుపేట లెప్రసీ కాలనీలో అసోసియేషన్ ఆఫ్ అలయన్స్ క్లబ్ కాకినాడ సేవాశక్తి ఆధ్వర్యంలో సోమవారం కుష్ఠు రోగులకు దుప్పట్లు, పండ్లు, బిస్కెట్లు, రొట్టెలు పంపిణీ చేశారు. క్లబ్ ఇంటర్నేషనల్ కమిటీ చైర్‌పర్సన్ చప్పిడి వెంకటేశ్వరరావు, క్లబ్ అధ్యక్షులు కె.లక్ష్మీనాగేంద్ర, వైస్ గవర్నర్ వనుం శ్రీనివాసరావు, కార్యదర్శి గణేష్, కె.వరలక్ష్మి పాల్గొన్నారు.

పంచాయతీల్లో గ్రామసభలు

కరప: మండలంలోని పంచాయతీ కార్యాలయాల్లో సోమవారం గ్రామసభలు నిర్వహించారు. పలు సమస్యలపై చర్చించి పరిష్కారానికి తీర్మానాలు చేశారు. కొన్ని గ్రామాల్లో సర్పంచులు పారిశుధ్య కార్మికులను సత్కరించి, స్వీట్లు అందజేశారు. ఆయా గ్రామసభల్లో ఎంపీడీఓ కర్రె స్వప్న, ఈఓపీఆర్డీ ఎస్వీ శ్రీనివాసరావు, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు రొక్కాల గణేష్, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

నర్సు కుటుంబాన్ని ఆదుకుంటాం



ఎంసీహెచ్ భవన ప్రాధాన్యాన్ని మంత్రి రజనికి వివరిస్తున్న ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి



జీజీహెచ్ న్యూరో సర్జరీ బృందంతో మంత్రి రజని, తదితరులు

మంత్రి రజని హామీ

కాకినాడ క్రైం: స్థానిక జీజీహెచ్‌లో విధులు నిర్వహిస్తూ మెదడులో రక్తస్రావంతో ప్రాణాలు కోల్పోయిన నర్సు గుత్తుల రామదుర్గ(32) మృతి దురదృష్టకరమని మంత్రి విడదల రజని అన్నారు. ఆమె కుటుంబంలో భర్తకు ఉద్యోగాన్నిచ్చి కుమార్తెలిద్దర్నీ ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ కాంట్రాక్టు నర్సెస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు కోరారు. దీనికి స్పందించిన మంత్రి రజని ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డికి సిఫార్సు చేశారు. ఆయన వారితో మాట్లాడుతూ మంగళవారం తన కార్యాలయానికి బాధిత కుటుంబ సభ్యులతో కలసి రావాలని చెప్పారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని అన్నారు. అనంతరం సంఘ సభ్యులు ప్రస్తావించిన కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులరైజేషన్‌పై మంత్రి మాట్లాడుతూ ఆ అంశం ముఖ్యమంత్రి పరిశీలనలో ఉందన్నారు. మంత్రిని కలిసిన వారిలో సంఘ జిల్లా అధ్యక్షుడు జీవ, జోనల్ కోఆర్డినేటర్ ఫిలిప్ తదితరులు ఉన్నారు.

దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలు



మజ్జిగను పంపిణీ చేస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: రాగిరెడ్డి వెంకట జయరాంకుమార్ చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో కాకినాడ జర్నలిస్టుల ఆధ్వర్యంలో స్థానిక కలెక్టరేట్ ఆవరణలో మజ్జిగ చలివేంద్రాన్ని సోమవారం ఏర్పాటు చేశారు. దీనిని కలెక్టర్ కృతికా శుక్లా, కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో సీఎస్ఆర్, కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్, పంచాయతీ శాఖల ద్వారా దాదాపు రెండు వందల చలివేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ప్రస్తుతం ఉదయం నుంచి అధిక ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్న నేపథ్యంలో ప్రజలు అత్యవసర పనులు ఉంటేనే బయటకు రావాలని సూచించారు. అదే విధంగా పాఠశాలలు ఈ నెలాఖరు వరకు ఉన్నందున వాటర్ బెల్ కాన్సెప్ట్ తప్పనిసరిగా అమలయ్యే విధంగా చూడాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

బోట్‌క్లబ్: ఎండ కాలంలో చలివేంద్రాలు బాటసారులకు ఎంతో ఉపయోగపడతాయని కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి అన్నారు. స్థానిక సినిమా రోడ్డులో కోకనాడ అన్నదాన సమాజం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. దీనిని ఏర్పాటు చేసిన అన్నదాన సమాజం చైర్మన్ ముమ్మిడి శ్రీనివాసరావును, ఈఓ శివబాబును ఆమె అభినందించారు. వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, మాజీ కార్పొరేటర్లు పసుపులేటి వెంటలక్ష్మి, రాగిరెడ్డి అరుణ్‌కుమార్ పాల్గొన్నారు. స్థానిక మెయిన్‌రోడ్డు విఘ్నేశ్వరస్వామి ఆలయంలో మజ్జిగ చలివేంద్రాన్ని కాకినాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బెండా విష్ణుమూర్తి ప్రారంభించారు. ఆలయ ఈఓ శివబాబు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన బ్యాడ్మింటన్ పోటీలు



బ్యాడ్మింటన్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న వీరభద్రారెడ్డి, చిత్రంలో హరీష్

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): దివంగత క్రీడాకారుడు కిరణ్ మంచి నైపుణ్యం కలిగిన బ్యాడ్మింటన్ క్రీడాకారుడని, ఆయన పేరున టోర్నీ నిర్వహించడం అభినందనీయమని కాకినాడ బ్యాడ్మింటన్ సంఘ అధ్యక్షుడు ద్వారంపూడి వీరభద్రారెడ్డి అన్నారు. కిరణ్ స్నేహితుల ఆధ్వర్యంలో హరీష్ స్పోర్ట్స్ నిర్వాహకుడు టి.హరీష్ సౌజన్యంతో స్థానిక ఆఫీసర్స్ క్లబ్‌లో నిర్వహించిన కిరణ్ స్మారక బ్యాడ్మింటన్ పోటీలు సోమవారంతో ముగిశాయి. అండర్-10, 13, 15 బాలురు, బాలికల సింగిల్స్, డబుల్స్, వెటరన్ 90 ప్లస్ పురుషుల డబుల్స్ విభాగాల్లో క్రీడాకారులు పోటీ పడ్డారు. పోటీల ముగింపు ఉత్సవానికి ద్వారంపూడి వీరభద్రారెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. ఆఫీసర్స్ బ్యాడ్మింటన్ క్లబ్‌లో ఎంతోమంది మేటి క్రీడాకారులు తయారయ్యారన్నారు. సాత్విక్ సాయిరాజ్ ఆఫీసర్స్ క్లబ్ బ్యాడ్మింటన్‌కు చెందినవాడే అన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. రూ.40 వేల ప్రైజ్ మనీ, మెమెంటోలు హరీష్ స్పాన్సర్ చేశారు. కార్యక్రమంలో కె.శ్రీనివాసరావు, పట్టాభిరామారావు, గణేష్, జి.రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

సమర్థవంతంగా విధులు నిర్వర్తించండి



కొమరగిరి లేఅవుట్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ మహేష్‌కుమార్ రావిరాల

కాకినాడ: ఉద్యోగులు మరింత సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్ రావిరాల సూచించారు. సోమవారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలోని వివిధ విభాగాలను అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావుతో కలసి ఆయన సందర్శించారు. స్త్రీశక్తి భవన్‌లో సాధారణ, అకౌంట్స్ విభాగాన్ని, రెండో అంతస్తులో రెవెన్యూ విభాగాన్ని పరిశీలించారు. మూడో అంతస్తులో 101 సెల్‌కు వెళ్లి అక్కడి ఉద్యోగుల కార్యకలాపాలను స్వయంగా చూశారు. ఆయా స్థానాల్లో ఉద్యోగుల విధులు, సెక్షన్ల వారీగా కార్యకలాపాలను తెలుసుకున్నారు. నగరపాలక సంస్థ కార్యదర్శి ఎం.ఏసుబాబు, డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్ తదితరులు ఉన్నారు. అనంతరం కొమరగిరి లేఅవుట్‌ను కమిషనర్ సందర్శించారు. నగర నియోజకవర్గ లబ్ధిదారులకు కేటాయించిన లేఅవుట్‌లో గృహ నిర్మాణ పనుల ప్రగతిని తెలుసుకున్నారు. మొత్తం 14,866 మంది లబ్ధిదారులకు ప్రస్తుతం 5,300 ఇళ్ల గ్రౌండ్ అయ్యాయని, ఇంటి నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయని గృహ నిర్మాణ శాఖ పీడీ సుధాకర్ పట్నాయక్ వివరించారు. గృహ నిర్మాణ శాఖ డీఈ సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

వ్యర్థ జలాలను శుద్ధిచేసే సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ పనులను మరింత వేగవంతం చేయాలని కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్ రావిరాల సంబంధిత అధికారులను ఆదేశించారు. ఏటిమొగలో ప్లాంట్ నిర్మాణ పనులను పరిశీలించారు. ఎస్‌టీపీ ద్వారా వ్యర్థ జలాలు శుద్ధి చేసే విధానాన్ని, ప్లాంట్ నిర్మాణ ప్రగతిని డీఈ మాధవి కమిషనర్‌కు వివరించారు.

ప్రజల నమ్మకం జగనన్నే..

- అడుగడుగునా సీఎంకు ఆదరణ
- కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి



కాకినాడ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

కాకినాడ: సంక్షేమ పాలన అందిస్తున్న సీఎం జగనన్నే మా నమ్మకం అని ప్రజలు ముక్తకంఠంతో చెబుతున్నారని కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి అన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం, జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాల ద్వారా ప్రజల్లోకి వెళ్లినప్పుడు కనిపిస్తోన్న ప్రజాదరణే ఇందుకు నిదర్శనమన్నారు. సోమవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం ద్వారా ఇంటింటికీ వెళ్లి ప్రశ్నావళి అందజేసి స్టిక్కర్లు అంటించే కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తుందన్నారు. అనేకచోట్ల స్టిక్కర్లు అడిగి మరీ ఇంటి గోడలకు అతికించుకుంటున్నారని చెప్పారు. మరికొందరైతే దేవుని పూజా మందిరంలో సీఎం ఫొటో పెట్టుకునేందుకు ఇష్టపడుతున్నారంటే జగన్ ప్రజల గుండెల్లో ఎంతటి స్థానాన్ని సంపాదించారో అర్థమవుతుందన్నారు. కాకినాడకు 50 వేల స్టిక్కర్లు పంపిస్తే అదనంగా మరో 30 వేల స్టిక్కర్లను పంపాలని కోరామన్నారు. సుమారు 50 వేల మంది ప్రభుత్వ పరిపాలనను స్వాగతిస్తూ ఫోన్ నంబర్‌కు మిస్డ్ కాల్స్ ఇచ్చారన్నారు. సుమారు 90 వేల గడపలకు తమ పార్టీ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, నాయకులు వెళ్లి ప్రజలతో మమేకమయ్యారన్నారు. 1,200 సర్వే పుస్తకాల్లో ప్రతి ఒక్కటి పూర్తి చేశామన్నారు.

ప్రచారం కోసం 'వనమాడి' పాకులాట

టీడీపీ మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు మరో కొత్త డ్రామాకు తెరతీశారని చంద్రశేఖరరెడ్డి మండిపడ్డారు. పరిష్కారం కాబోతున్న సమస్యల వద్దకు వెళ్లి ఫొటోలు దిగుతూ తన వల్లే సమస్యకు మోక్షం కలిగిందనే ప్రచారం కోసం అతను పాకులాడుతున్నారంటూ ఎద్దేవా చేశారు. గతంలో ఎన్టీఆర్ వారధి, ఓ వైన్‌షాపు వివాదం, తాజాగా డంపింగ్ యార్డు వద్ద కొండబాబు చేస్తున్న హంగామానే ఇందుకు అద్దం పడుతోందన్నారు. ఇప్పటికైనా కొండబాబు చీప్ ట్రిక్స్ మానుకోవాలని హితవు పలికారు. కొండబాబు ఏదైనా వాట్సాప్ నంబర్ ఇస్తే ఆయన హయాంలో దుస్థితి, తమ పాలనలో ప్రగతిని వివరించేలా ఫొటోలు పంపిస్తామన్నారు. కాకినాడలో యూజర్ చార్జీలను రూ. 90, 60, 30లుగా విభజిస్తూ త్వరలోనే ఉత్తర్వులు విడుదల కానున్నాయన్నారు. కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగరాధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఎమ్మెల్సీ అభ్యర్థి కర్రి పద్మశ్రీ, మాజీ డిప్యూటీ మేయర్లు పసుపులేటి వెంకటలక్ష్మి, మీసాల ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.



జి.భావారంలో గృహిణికి కరపత్రం అందజేస్తున్న సర్పంచ్ గణేష్

కరప: మండలంలోని పలు గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. జి.భావారం, కొరిపల్లి, పెద్దాపురప్పాడు, వేములవాడ తదితర గ్రామాల్లో ఇంటింటికీ పార్టీ శ్రేణులు వెళ్లి ప్రభుత్వ పథకాలు, సీఎం జగన్ పాలనపై సర్వే చేశారు. ఆయా కార్యక్రమాల్లో మండల సచివాలయాల కన్వీనర్ కాదా వెంకటేశ్వరరావు, సర్పంచులు రొక్కాల గణేష్, పలివెల నాగేశ్వరరావు, చింతా బుజ్జి పాల్గొన్నారు.

ఉత్తమ సేవలతోనే గుర్తింపు

- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు
- పంచాయతీలకు అవార్డుల ప్రదానం



తిమ్మాపురం సర్పంచ్ సత్యనారాయణ, కార్యదర్శిలను సన్మానిస్తున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

కాకినాడ రూరల్: పంచాయతీల్లో ఉత్తమ సేవలు అందిస్తే గుర్తింపు దానికదే వస్తుందని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు అన్నారు. సోమవారం జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో మండలంలో ఉత్తమ పంచాయతీల సర్పంచ్‌లు, కార్యదర్శులు, ప్రత్యేకాధికారులను సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కన్నబాబు మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్ సరఫరాకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. మండలంలో జిల్లా స్థాయిలో కొవ్వాడ, కొవ్వూరు, తిమ్మాపురం ఉత్తమ పురస్కారాలు పొందాయన్నారు. మండల స్థాయిలో 12 ఉత్తమ పంచాయతీలుగా నిలిచాయన్నారు. ఇందులో జిల్లా, మండల స్థాయిల్లో 9 అంశాలలో తిమ్మాపురం పురస్కారాలు అందుకుంది. ఉత్తమ పురస్కారాలు అందుకున్న తిమ్మాపురం సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ, నేమాం సర్పంచ్ రామదేవు సూర్యప్రకాశరావు, కొవ్వూరు సర్పంచ్ పిల్ల చక్రరావు, సర్పంచ్ సర్పంచ్ శీలం నాగేశ్వరరావు, పెనుమర్తి సర్పంచ్ పెంకే ఆనందకుమార్, గంగనాపల్లి సర్పంచ్ గీసాల మహాలక్ష్మి, కొవ్వాడ సర్పంచ్ కోటిపల్లి ఉమా, ప్రత్యేక అధికారులు డీఎల్‌డీఓ నారాయణమూర్తి, తహసీల్దార్ మురార్జీ, ఎంపీడీఓ శ్రీనివాస్, ఈఓపీఆర్డీ మురళీ, పంచాయతీ కార్యదర్శులను కన్నబాబు సత్కరించారు. జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, గోపుశెట్టి బాబ్జీ, గీసాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పెనుగుదురుకు అవార్డులు



కలెక్టరేట్‌లో పెనుగుదురు సర్పంచ్ వెంకట మాధవిని సత్కరిస్తున్న కలెక్టర్ కృత్తికా శుక్లా

కరప: పెనుగుదురు పంచాయతీకి సంవృద్ధిగా తాగునీటి సరఫరా, మౌలిక వసతుల కల్పనలో జిల్లా స్థాయి రెండు అవార్డులు వచ్చాయి. కాకినాడలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో సర్పంచ్ రెడ్డిపల్లి వెంకటమాధవి, గ్రామ కార్యదర్శి బద్దా చంద్రకళలను కలెక్టర్ కృత్తికా శుక్లా, సీఈఓ ఎన్‌వీవీ సత్యనారాయణ సత్కరించి, అవార్డులు అందజేశారు. ఆ గ్రామ నాయకుడు రెడ్డిపల్లి రమేష్, డిప్యూటీ సీఈఓ ఎ.రమణారెడ్డి, డీఎల్‌డీఓ పాఠంశెట్టి నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

కాకినాడ: స్పందన కార్యక్రమానికి వచ్చే ప్రతి అర్జీకి నాణ్యమైన పరిష్కారం చూపాలని నగరపాలక సంస్థ కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్ రావిరాల అధికారులను ఆదేశించారు. స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందనలో ప్రజల నుంచి ఆయన వినతులు స్వీకరించారు. టౌన్ ప్లానింగ్, ప్రజారోగ్యం, రెవెన్యూ, అకౌంట్స్ విభాగాలకు సంబంధించి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు విజ్ఞాపనలను అందజేశారు. ప్రజల సమస్యలను పరిష్కరించాలనే లక్ష్యంతో ప్రభుత్వం స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని, అర్జీలను వేగంగా పరిష్కరించాలని అన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయం వరకూ రాలేని ప్రజలు స్థానికంగా ఉండే సచివాలయాల్లో కూడా దరఖాస్తులు అందజేయవచ్చన్నారు. కోర్టు వివాదాలు, ఆర్థికపరమైన అంశాలతో ముడిపడిన సమస్యలు మినహా ప్రతి సమస్యను సత్వరం పరిష్కరిస్తామన్నారు. అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు, కార్యదర్శి ఏసుబాబు పాల్గొన్నారు.

ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దుదాం..



సర్పంచ్ ఏసుబాబు, కార్యదర్శి చంద్రకళ, సుధాకర్‌కు అవార్డులు ఇస్తున్న అధికారులు, నాయకులు

కరప: గ్రామాల్లో సమస్యలను పరిష్కరిస్తూ ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా ఆదర్శంగా తీర్చిదిద్దాలని ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి అన్నారు. సోమవారం జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఎంపీడీఓ కర్రె స్వప్న మాట్లాడుతూ సర్పంచులు, అధికారుల సమన్వయంతో ఉత్తమ పంచాయతీలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేద్దామన్నారు. ఈఓపీఆర్డీ ఎస్వీ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వం నిబంధనలకు అనుగుణంగా 9 అంశాల ప్రాతిపదికన ప్రణాళికలు రూపొందించుకుని అవార్డులు సాధించేలా గ్రామాలను సుందరంగా మార్చుదామన్నారు. 9 థీమ్స్‌లలో ఉత్తమ ప్రతిభ కనబరచిన పంచాయతీలకు నాయకులతో కలసి అధికారులు అవార్డులు ప్రదానం చేశారు. పాతర్లగడ్డకు-7, పెనుగుదురుకు-5, విజయరాయుడు పాలెంకు-4, కూరాడకు-3, పెద్దాపురప్పాడుకు-3, పెదకొత్తూరుకు-2, వేళంగి, వాకాడ, గొర్రిపూడి గ్రామాలకు ఒక్కొక్కటి చొప్పున అవార్డులు వచ్చాయి. ఆయా సర్పంచులను, కార్యదర్శులను సత్కరించి, అవార్డులను అందజేశారు. మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, మండల యూత్ అధ్యక్షుడు పెంకే సత్తిబాబు, తహసీల్దార్ పి.శ్రీనివాసరావు, ఏఓ గుత్తుల భీమశంకరరావు తదితరులు పాల్గొన్నారు.